క్లుప్తంగా

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటా


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ

రాయికల్: మండలంలోని మైతాపూర్ బీజేపీ గ్రామ అధ్యక్షుడు దుంపల రాజిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బుధవారం ఎంపీ ధర్మపురి అర్వింద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ రాజిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని, పార్టీ పరంగా ఆర్థికసాయం అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి, అసెంబ్లీ కన్వీనర్ మదన్‌మోహన్, ఎంపీటీసీలు రాజనాల మధు, ఆకుల మహేశ్, నాయకులు పడాల తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి


ఆయిల్‌మిల్ ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్

కథలాపూర్: మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు అన్నారు. బుధవారం మేడిపెల్లి మండలకేంద్రంలో సెర్ప్ ఆధ్వర్యంలో పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా రూ. 3 లక్షలతో ఏర్పాటు చేసిన ఆయిల్ మిల్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ పథకంలో 35 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. మహిళలు సబ్సిడీపై అందించే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఎం గట్ల అశోక్, బ్యాంక్ మేనేజర్ వినోద్, సర్పంచ్ అభిలాష్, నాయకులు సత్తిరెడ్డి, రాజాగౌడ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

ధర్మపురి: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన పసుల అమ్మక్క, అచ్చయ్య గార్ల కుమార్తె లావణ్యకు బుధవారం వివాహం జరిగింది. తండ్రి అచ్చయ్య గతంలో మృతి చెందాడు. యువతి వివాహానికి కాంగ్రెస్ నాయకులు 8 వేలు ఆర్థిక సాయం అందజేశారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రూ.5 వేలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ దినేశ్ రూ. 3 వేలు ఆర్థిక సాయాన్ని అందజేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు సింహరాజు ప్రసాద్, మొగిలి, రాజేశ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

మల్లాపూర్: పేదింటి అమ్మాయి వివాహానికి మానవత దృక్పథంతో సీఎస్ఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. బుధవారం మల్లాపూర్ మండలంలోని కొత్తదాంరాజుపల్లికి చెందిన పేదింటి అమ్మాయి పెళ్లి సందర్భంగా సీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు చెన్నమనేని శ్రీనివాస్‌రావు లత దంపతులు రూ.20వేల నగదు, పెళ్లికి పట్టుచీరను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, సర్పంచ్ బద్దం సరిత, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి లత, నాయకులు పాల్గొన్నారు.

పొగాకు వాడితే అనారోగ్యం


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

జగిత్యాల: పొగాకు వాడటం వల్ల అనారోగ్యానికి గురవుతారని, క్యాన్సర్ బారిన పడేలా చేస్తుందని ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎండీ.సమీయొద్దీన్ అన్నారు. బుధవారం పొగాకు వాడటం వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు వివరించారు. జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్, పాతబస్టాండ్, గొల్లపల్లి రోడ్‌లలో పొగాకు వాడేవారిని కలిసి వాటి వల్ల వచ్చే సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిగరెట్, పొగాకు తాగేవారి కన్నా పక్కనున్న వారికే ఎక్కువ నష్టం జరుగుతుందన్నారు. జనం ఎక్కువ ఉన్న ప్రాంతంలో పొగ తాగితే కోప్టా 2023 సెక్షన్ 4 ప్రకారం ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సాగర్‌రావు, మురళీధర్‌రావు, శ్యామ్ పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్‌లో సిబ్బంది కొరత

- ఐదుగురికి గాను ఒక్కరే విధులు
- భవన నిర్మాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- అనుమతి లేకుండా భవనాల నిర్మాణం
- బల్దియా ఆదాయానికి గండి


మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

మెట్‌పల్లి: 'పట్టణంలోని ఓ వార్డులో నాలుగేళ్ల క్రితం ఓ వ్యక్తి మున్సిపల్ నుంచి అనుమతి తీసుకొని గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్లతో కూడిన ఓ వాణిజ్య భవనం నిర్మించాడు. ప్రస్తుతం ఎటువంటి అనుమతి తీసుకోకుండా దానిపై మరో ఫ్లోర్‌ను నిర్మిస్తున్నాడు. అలాగే మరో వార్డులో కూడా వాణిజ్య భవనం నిర్మాణానికి గ్రౌండ్ ఫ్లోర్ అనుమతి తీసుకుని అదనంగా మరో ఫ్లోర్‌ను నిర్మిస్తున్నారు.' ఇవే కాదు పలు వార్డుల్లో అనుమతులు పొందకుండానే ఇష్టారాజ్యంగా భవనాల నిర్మాణం చేపడుతున్నారు. దీంతో మున్సిపల్‌కు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ విభాగం ప్రధానమైనది. భవన నిర్మాణాలకు అనుమతి, ట్రేడ్ లైసెన్స్‌లను ఈ విభాగం జారీ చేస్తుంది. తద్వారా బల్దియాకు ఫీజుల రూపంలో భారీగా ఆదాయం సమకూరుతోంది. వచ్చే ఈ ఆదాయంతో సిబ్బందికి జీతాలు, వార్డుల్లో అభివృద్ధి పనులను చేపట్టడానికి అవకాశముంటుంది. అయితే టౌన్ ప్లానింగ్‌లో సిబ్బంది కొరతతో భవన నిర్మాణాలు, ట్రేడ్ లైసెన్స్‌లపై పర్యవేక్షణ కొరవడడంతో కొంతకాలంగా ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఒకే ఒక్కరు..

- టౌన్ ప్లానింగ్ విభాగంలో ఇద్దరు టీపీబీవోలు, ఇద్దరు టీపీఎస్‌లు, ఒక టీపీవో ఉండాలి.
- కానీ ప్రస్తుతం ఒక్క టీపీవో మాత్రమే ఉన్నారు. మిగతా నాలుగు పోస్టులు చాలా కాలంగా ఖాళీగానే ఉన్నాయి.
- పట్టణంలో 26వార్డులున్నాయి. ఇందులో శివారు కాలనీల్లో భవన నిర్మాణాలు ఎక్కువగా సాగుతున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులాతో పాటు కొన్ని ప్రధానమైన ప్రాంతాల్లో వాణిజ్య భవనాల నిర్మాణం జరుగుతోంది.
- అయితే ఇందులో కొన్ని అనుమతులు లేకుండా, మరికొన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు.
- సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బదిలీపై రావడానికి విముఖత

- టౌన్ ప్లానింగ్ విభాగంలో చాలా కాలంగా పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ఇతర మున్సిపాలిటీల నుంచి ఇక్కడకు రావడానికి ఎవ్వరూ ఆసక్తి చూపడం లేదు.
- ఈ విభాగంలో పని చేసే సిబ్బందిపై ఒత్తిళ్లు ఎక్కువగా ఉంటాయనే ప్రచారం ఉంది. దీంతో మెట్‌పల్లికి రావడానికి వెనుకంజ వేస్తున్నారనే అభిప్రాయం ఉంది.
- గత్యంతరం లేక ఉన్నతాధికారులు డిప్యూటేషన్‌పై నియమిస్తూ వస్తున్నారు. ఇటీవల వరకు డిప్యూటేషన్‌పై ఇక్కడ విధులు నిర్వహించిన ఇద్దరు అధికారుల్లో ఒకరు ప్రమోషన్‌పై వెళ్లిపోగా, మరొకరు దానిని రద్దు చేసుకున్నారు.

తొందరలోనే సిబ్బంది నియామకం



టౌన్ ప్లానింగ్‌తో పాటు ఇతర విభాగాల్లోను సిబ్బంది కొరత ఉంది. ఇటీవల ప్రభుత్వం సిబ్బంది నియామకం కోసం పరీక్ష నిర్వహించింది. ఫలితాలు వెల్లడించాల్సి ఉంది. దీని తర్వాత ఖాళీగా ఉన్న చోట సిబ్బందిని నియమిస్తుంది.
– జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన


బొడ్రాయి ప్రతిష్ఠాపనలో బోనాలతో మహిళలు

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో బుధవారం సీఎస్సార్ ఫౌండేషన్, గ్రామస్తుల ఆధ్వర్యంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అన్ని కుల సంఘాల సభ్యులందరూ తమ కుటుంబాలతో పాటు ఇతర భక్తులు తరలిరాగా, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని డప్పుచప్పుళ్ల మధ్య గ్రామంలోని మహిళలు బోనాలతో పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో అర్చకులు శాస్త్రోక్తంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన, కళశపూజ, శాంతి కల్యాణం తదితరపూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఎస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చెన్నమనేని శ్రీనివాస్‌రావు సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, సర్పంచ్ బద్దం సరిత, ఉపసర్పంచ్ లత, మాజీ ఎంపీపీ బద్దం విజయ, నాయకులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

పెగడపల్లి: ముదిరాజ్ ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని మండల కేంద్రంలోని యాపాల్ చెరువు సమీపంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రతిష్ఠించారు. విగ్రహాన్ని ప్రతిష్ఠించి మొక్కులు చెల్లించుకున్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెరకాలనీలోని గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణస్వామి, హనుమాన్ యంత్ర విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గొడిశెల రాజేశం గౌడ్, మాజీ జెడ్పీటీసీ జితేందర్‌రావు, సర్పంచులు రజిత, రాజమణి, నారాయణ, రైతుబంధు మండల కన్వీనర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

సీతారామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యేను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి


ఫిర్యాదు చేస్తున్న నేతకాని సంఘం నాయకులు

ధర్మపురి: మంచిర్యాల జిల్లా బెల్లంపెల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై నిరాధారణమైన ఆరోపణలు చేసినం వారిపై ఎస్సీ,ఎస్టీ కేసులు నమోదు చేయాలని బుధవారం మహర్ సంఘం నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుర్గం చిన్నయ్యపై ఇటీవల హైదరాబాద్‌లో ఫ్లెక్సీలు కట్టి నిరాధారమైన ఆరోపణలు చేసి మనోవేదనకు గురిచేశారని పేర్కొన్నారు. ఆరోపణలు చేసిన అగ్రకులాలకు చెందిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా నేతకాని మహర్ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడు దుర్గం రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, పసుల బుచ్చన్న, దుర్గం రాజన్న తదితరులున్నారు.

గ్రామాల్లో అభివృద్ధిని కలిసి చర్చించుకుందాం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


కండ్లపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, ప్రగతిని కలిసి చర్చించుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మీరు నేను కార్యక్రమంలో భాగంగా బుధవారం బీర్‌పూర్ మండలం కండ్లపల్లిలో రాత్రి పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు గ్రామంలో ప్రభుత్వం అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధులు, సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించిన నిధులను లెక్కలతో సహ వివరించారు. ఎంత మందికి సంక్షేమ పథకాలు అందాయన్న దానిపై వివరాలను పేర్కొంటు, గ్రామంలో ఇంకా ఏమైనా అవసరాలు ఉన్నాయా, ప్రజలకు పథకాలు పూర్తిస్థాయిలో అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం గ్రామంలో రాత్రి బస చేసి పల్లెనిద్ర చేశారు. ఆయన వెంట కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, ముక్క శంకర్, సర్పంచ్ పర్వతం రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారపాక రమేశ్, కార్యకర్తలు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయికల్ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజిరెడ్డి


రాజిరెడ్డి

రాయికల్: ఫిషర్‌మెన్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా దువాక రాజిరెడ్డిని నియమిస్తూ బుధవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫిషర్‌మెన్ అధ్యక్షుడు తోపారపు రజనీకాంత్, మండల అధ్యక్షుడు పల్లికొండ రమేశ్, నాయకులు రాజేశ్, భీమయ్య, రాజం, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జిగా ప్రమోద్

కోరుట్ల రూరల్: ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జిగా బంగారి ప్రమోద్ ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కోరుట్ల పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమోద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పురుగు శ్రీను జగన్, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బలవంతుల సురేశ్, నాయకులు కిషన్, లోషన్, దినేశ్, వెంకటేశ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గ నూతన కమిటీ నియామకం


శ్రీనివాస్

వెల్గటూర్: బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షుడిగా వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామానికి చెందిన కుషనపెల్లి శ్రీనివాస్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి మద్దెల నారాయణ సూచనమేరకు శ్రీనివాస్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడుగా బచ్చల స్వామి, ప్రధాన కార్యదర్శిగా నక్క గంగాధర్, కోశాధికారిగా దీకొండ రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ముంజ లీలాగౌడ్, మైనారిటీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా షాహినాబేగంను నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ధర్మపురి గడ్డమీద బీఎస్పీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బచ్చల స్వామి, సైదాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనంత పద్మనాభస్వామి జాతర


ఏనుగు అంజిరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ గ్రామ శివారులో అనంత పద్మనాభస్వామి జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఏనుగు అంజిరెడ్డికి అభినందన

అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు శివ మారుతి రెడ్డి సివిల్స్‌లో 132వ ర్యాంకు సాధించగా ఆయన తండ్రి ఏనుగు అంజిరెడ్డిని అయిలాపూర్‌లో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అభినందించి, సన్మానించారు. విద్యార్థులు శివ మారుతి రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్,నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి: ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సూచించారు. పట్టణంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో జనుము, జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా వాటిని అందజేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కేంద్రం నిర్వాహకులు తొగిటి రాజశేఖర్‌ల, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

కోరుట్ల: పట్టణంలోని 20 వ వార్డులో స్థానిక కౌన్సిలర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యాలయం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

రాయికల్: మండలంలోని మూటపల్లిలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు బుధవారం మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజేశ్, సర్పంచ్ బెక్కం తిరుపతి, రైతులు విష్ణు, రాజేందర్, వెంకట్ రెడ్డి, చిన్నరాజం, అంజయ్య పాల్గొన్నారు.

ఫర్టిలైజర్‌షాపుల్లో అధికారుల తనిఖీ


కథలాపూర్‌లో తనిఖీ చేస్తున్న ఏవో, ఎస్సై

కథలాపూర్: మండలకేంద్రంలోని ఫర్టిలైజర్‌షాపులను బుధవారం ఏవో యోగితా, ఎస్సై శ్వేత తనిఖీ చేశారు. షాపుల్లో నిల్వ ఉన్న మందులు పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని అధికారులు పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి రశీదులు తీసుకోవాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జగిత్యాల రూరల్ ఎస్సై


ఎస్సై సదాకర్

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ ఎస్సైగా సదాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై ఎస్పీకి అటాచ్ కాగా, సీసీఎస్‌లో పనిచేస్తున్న సదాకర్‌ను జగిత్యాల రూరల్ ఎస్సైగా బదిలీపై వచ్చారు. ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం రాత్రి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మేడిపెల్లి ఎస్సైగా చిరంజీవి బాధ్యతలు స్వీకరణ

కథలాపూర్: మేడిపెల్లి ఎస్సైగా మంద చిరంజీవి బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై సుధీర్‌రావు జగిత్యాల వీఆర్‌కు బదిలీ కాగా, మల్యాల ఎస్సైగా పనిచేస్తున్న చిరంజీవి మేడిపెల్లి కి బదిలీపై వచ్చారు. అనంతరం పోలీస్ సిబ్బందిని పరిచయం చేసుకున్నారు.

పద్మశాలీ విద్యార్థులకు పురస్కారాలు

రాయికల్: రాయికల్ పట్టణ, మండలంలోని పద్మశాలీ విద్యార్థులు పదో తరగతిలో 9 జీపీఏ, ఇంటర్‌లో 900లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పోపా ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్లు ప్రధాన కార్యదర్శి ఎలిగేటి రాజ్‌కిశోర్ బుధవారం తెలిపారు. ఈనెల 28న రాయికల్ పట్టణంలోని పద్మశాలీ సంఘ భవనంలో అభినందన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 9440230846 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పునాదులు

పెగడపల్లి: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పునాదులని ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితుడు వోరుగంటి రమణారావు అన్నారు. మండల కేంద్రంలో ఈ నెల 28న పెగడపల్లిలో నిర్వహించే మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరుగనుండగా ముందస్తుగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్యకర్తలందరూ సోదరభావంతో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, ఎంపీపీ శోభ, ఆర్బీఎస్ మండల కన్వీనర్ నరేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గంగాధర్, ఏఎంసీ వైస్ చైర్మెన్ అంజి, జిల్లా నాయకులు ఆనందం సీనియర్ నాయకులు శ్రీనివాస్, స్వామి, కరుణాకర్‌రావు, గ్రామశాఖ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

కథలాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2004–05 విద్యాసంవత్సరం ఎస్సెస్సీ పూర్తిచేసిన విద్యార్థుల సమావేశం బుధవారం జరిగింది. 18 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు ఆట పాటలతో ఆనందోత్సవాల మధ్య గడిపారు. పాఠశాల దశలోని జ్ఞాపకాలను విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. సాయంత్రం సామూహికంగా భోజనాలు చేసి ఆటోగ్రాఫ్ తీసుకుని సమావేశాన్ని ముగించారు.

సంక్షిప్త వార్తలు

వేంకటేశ్వర స్వామి కల్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి వేంకటేశ్వరస్వామి కల్యాణ మండప నిర్మాణానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నిధుల నుంచి రూ. 3.5 లక్షల నిధులు మంజూరు చేసినట్లు బీజేపీ నాయకుడు సురభి నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. కల్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌ను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, వీడీసీ అధ్యక్షుడు వెంకటాద్రి, సభ్యులు అడువల రాము, ఎల్ల శంకర్, బీజేపీ నాయకులు మాలేపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

రాయికల్: పట్టణంలో అనారోగ్యంతో మృతిచెందిన చెవులమద్ది గంగరాజం కుటుంబ సభ్యులకు బుధవారం శ్రీరక్ష సేవా సమితి సభ్యులు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొత్తపల్లి గంగాధర్, కార్యనిర్వాహణ కార్యదర్శి సామల్ల సతీశ్, కోశాధికారి మోర నరేశ్, బైరి సుకేశ్, అనిల్, రాజు, శ్రీధర్, రాంసురేశ్ పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

ఇబ్రహీంపట్నం: రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని, దానికనుగుణంగా ఎరువులను వాడాలని ఇఫ్కో సంస్థ జగిత్యాల జిల్లా మేనేజర్ శ్రీధర్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఇఫ్కో సంస్థ ఆధ్వర్యంలో భూసార పరీక్ష నమునా సేకరణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడకంపై దృష్టి సారించాలన్నారు. నానో డీఏపీ వాడితే అధిక లాభాలు సాధించవచ్చన్నారు. వ్యవసాయంలో ఎప్పటికప్పుడు వస్తున్న నూతన శాస్త్ర సాంకేతిక విధానాలను అనుసరిస్తు పంటల సాగులో రైతులు మెళకువలు పాటించాలన్నారు. ఇఫ్కొ సంస్థ రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు చేస్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో కార్యదర్శి మంత్రి సతీశ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామానికి చెందిన రాచర్ల శ్రీనివాస్‌కు మంజూరైన రూ. 70 వేల సీఎమ్మార్ఎఫ్ చెక్కును మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి బుధవారం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, రైతు బంధు సమితి అధ్యక్షుడు బద్దం మహేందర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కొత్తపెల్లి శ్రీనివాస్, గంగారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి ఉన్నారు.

మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ఇబ్రహీంపట్నం: 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్ బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థుల వివరాలను నోటీస్ బోర్డుపై పెట్టినట్లు ఆయన తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 31 వరకు పాఠశాలలో అడ్మిషన్ పొందగలరని పేర్కొన్నారు.

గొల్లపల్లి మోడల్ హైస్కూల్ ఫలితాలు..

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ఫలితాలు విడుదలైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. సెలెక్ట్ అయిన వారు సంబంధిత ధ్రువపత్రాలతో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను నోటీస్‌బోర్డుపై ప్రదర్శించామని, జూన్ 4లోపు విద్యార్థులు చేరాలని కోరారు.

అంబేడ్కర్ మాల యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల: పట్టణంలోని అంబేడ్కర్ సంఘ భవనంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాల యువజన సంఘం కోరుట్ల నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కుంబ ఆనంద్, ఉపాధ్యక్షుడిగా మ్యాకల మహేశ్, ప్రధాన కార్యదర్శిగా పొట్ట సురేందర్, సహాయ కార్యదర్శిగా పసుల విక్రం కుమార్, కోశాధికారిగా దామ రాజేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మగ్గిడి వెంకటి, శోభన్ బాబు, కొండయ్య, సురేశ్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జట్లకు కిట్లు పంపిణీ

జగిత్యాల: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు జగిత్యాలకు చెందిన డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. ఈనెల 25 నుంచి సూర్యాపేటలో జరుగనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో జగిత్యాల క్రీడాకారులు పాల్గొననున్నారు. వారికి స్పోర్ట్స్‌కు సంబంధించిన కిట్లు అందజేయడంతో వైద్యుడికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు విశ్వప్రసాద్, కృష్ణప్రసాద్, అజయ్‌బాబు, వేణు, అనిల్, సమంత్, శ్రీరామ్, హర్షిక, దర్శిక పాల్గొన్నారు.